అమరుల స్ఫూర్తితో ప్రజాపాలన

- సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికన ప్రభుత్వ పథకాలు
- జాతీయ పతాకావిష్కరణ చేసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి
- జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రజా పరిపాలన దినోత్సవం
- హాజరైన ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు



జాతీయ జెండాను ఆవిష్కరించి, వందన సమర్పణ చేస్తున్న చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న చిన్నారెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వారి స్ఫూర్తితో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పరిపాలనను కొనసాగిస్తున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయాన్ని ప్రామాణికంగా తీసుకుని రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్ చౌరస్తాలోని ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయంలో ఉదయం 10 గంటలకు చిన్నారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, జిల్లా ఫారెస్టు అధికారి రోహిత్‌గోపిడి, అడిషనల్ కలెక్టర్ దేవసహాయం తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. పతాకావిష్కరణ అనంతరం ప్రసంగించిన చిన్నారెడ్డి రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికన సబ్బండ వర్గాలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రణాళికాబద్ధమైన విధానాలు, ఆర్థిక క్రమశిక్షణ, జన సహకారంతో రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రం మరింత పురోగమించగలదనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు కార్యాచరణ ప్రారంభించిందన్నారు. మహాలక్ష్మీ పథకం అమలులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు 2కోట్ల 80లక్షల 42 వేల 235 మంది మహిళలు లబ్ధి పొందారన్నారు. ఈ పథకం కింద రూ.126 కోట్ల 23 లక్షలు మహిళలు ఆదా చేసినట్లయిందని వివరించారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసే పథకం ద్వారా ఒక లక్షా 3,507 మంది లబ్ధి పొందుతున్నారని, గృహజ్యోతి పథకం ద్వారా 96,365 గృహ వినియోగదారులందరికీ జీరో బిల్లు జారీ చేస్తున్నామని తెలిపారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచి జిల్లాలో ఇప్పటివరకు 60వేల 541 మందికి వైద్య సేవలందించామన్నారు. ఇందు కోసం రూ.132 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందని చెప్పారు. డయాలసిస్ రోగులకు చికిత్సను పూర్తిగా అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రతీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అర్హులైన పేదలకు సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు రూ.ఐదు లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.ఆరు లక్షల రూపాయల ఆర్థిక సహాయమందిస్తున్నామన్నారు. ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం జిల్లాలో మంచి ఫలితాలను ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.

గణనీయంగా వ్యవసాయాభివృద్ధి

జిల్లాలో వ్యవసాయ అభివృద్ధి కూడా గణనీయంగా పెరిగిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఏడాది వానాకాలం సీజన్‌లో మూడు లక్షల 97 వేల 437 ఎకరాల్లో పత్తి, వరి, మొక్కజొన్న పంటలు సాగయ్యాయన్నారు. రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం రుణమాఫీ కింద మూడు విడతల్లో లక్షలోపు రుణాలు 99 వేల 309 మందికి రూ.933.57 కోట్లు మాఫీ చేసిందన్నారు. రైతు భరోసా కింద జిల్లాలో మూడు లక్షల ఆరు వేల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.981 కోట్లు జమ చేశామన్నారు. రైతుబీమా కింద నేటివరకు జిల్లాలో 6033 మంది రైతుల నామినీలకు ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షల చొప్పున మొత్తం రూ.301.65 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. వానాకాలం సీజన్‌లో జిల్లాలోని 1994 చెరువులకు గాను 1200 చెరువులు పూర్తిగా నిండాయని స్పష్టం చేసిన ఆయన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 38 లక్షల 22 వేల మొక్కలు నాటడం జరిగిందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



అమరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆరోగ్యశ్రీ సేవలకు ఆటంకం

- నేటి నుంచి నిరవధిక సమ్మెలోకి ఆరోగ్యమిత్రలు
- వేతనాలు పెంచాలని, కేడర్ పేరు డీపీవోగా మార్చాలని డిమాండ్
- 45 ఆస్పత్రుల్లో నిలిచిపోనున్న సేవలు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మిత్ర సహాయ కేంద్రం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), సెప్టెంబరు 17: వేతనాలు పెంచాలని, కేడర్ మార్చాలని ఆరోగ్య మిత్రలు బుధవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తుండటంతో ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. నిరుపేదలకు వరంగా ఉన్న ఈ పథకంలో ముఖ్య భూమిక పోషిస్తున్న ఆరోగ్యమిత్రల సమ్మెతో ఉమ్మడి జిల్లాలోని 45 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలు బంద్ కానున్నాయి. అధికారులు ఏం చేస్తారనే విషయంపై ఉత్కంఠ నెలకొంది.

పథకం అమలులో ప్రముఖ పాత్ర

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చారు. ఈ పథకం ద్వారా ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. దీంతో నిరుపేదలకు ఈ పథకం వరంగా మారింది. కొన్ని వేల మంది ఈ పథకంతో లబ్ధిపొందడంతో పాటు ఎంతో మంది ప్రాణాలు నిలిచాయి. అందుకే ఈ పథకానికి దేశంలోనే మంచి పేరుంది. ఈ పథకాన్ని ముందుండి నడిపించేది ఆరోగ్యమిత్రలే. ఆస్పత్రికి ఒక కేసు వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ ట్రస్టులో రిజిష్టర్ చేయడంతో పాటు ఆపరేషన్ చేయించి, ఆటో చార్జీలు సైతం ఇచ్చి ఇంటికి పంపించే వరకు వారు సేవలు అందిస్తారు. ఆపరేషన్‌కు అనుమతి తీసుకొని, తిరిగి ఫొటోలు తీసి పంపించి, ఆయా ఆస్పత్రులకు ప్రోత్సాహకాలు జమ చేస్తున్నారు. అలాంటి తమ సమస్యలు తీర్చాలని ప్రభుత్వాలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా తమ మొర ఆలకించడం లేదని అంటున్నారు. అందుకే సమ్మె చేయడానికి నిర్ణయించుకొని పథకం జిల్లాల బాధ్యులకు నోటీసులు ఇచ్చారు.

అందుకే సమ్మెలోకి వెళ్తున్నాం..



ఆరోగ్యశ్రీతో పాటు ఈహెచ్‌ఎస్, జర్నలిస్టుల ఆరోగ్య సంక్షేమం, ఆయుష్మాన్ భారత్ వంటి అన్ని వైద్య సేవల పథకాలు మేమే చేస్తున్నాం. కరోనా సమయంలో పీహెచ్‌సీలలో మా సేవలు వినియోగించుకున్నారు. కానీ మా సమస్యలు తీర్చడం లేదు. పేరుకు ప్రభుత్వ సంస్థలో పని చేస్తున్నామన్న మాటే తప్ప.. ఒక ఆఫీస్ సబార్డినేట్‌కు ఇచ్చే వేతనం ఇస్తున్నారు. మా సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకో లేదు. అందుకే సమ్మెలోకి వెళ్తున్నాం.

- గిరిప్రసాద్, ఆరోగ్యమిత్ర యూనియన్ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం..

ఆరోగ్యమిత్రలు సమ్మెకు వెళ్తున్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. అత్యవసర సేవలకు ఆటంకం కలుగకుండా రాత్రివేళల్లో ఉండే వారికి మినహాయింపు ఇవ్వాలని మాట్లాడుతున్నాం. లేదంటే ఆయా ఆస్పత్రుల్లోని డాటా ఎంట్రీ ఆపరేటర్ల సహాయం తీసుకుంటాం. సేవలు నిలిచిపోకుండా ఆయా ఆస్పత్రుల్లో ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఐడీలు ఇచ్చి, కేసుల వివరాలు రిజిష్టర్ చేయిస్తాం. ప్రైవేటు ఆస్పత్రుల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మాత్రం కామన్ ఐడీలు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ స్వప్న, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త, మహబూబ్‌నగర్

డిమాండ్లు ఇవే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. అందులో 94 మంది ఆరోగ్య మిత్రలు పని చేస్తున్నారు. 2007లో ఆరోగ్య మిత్రలకు నెలకు రూ.3,500 వేతనం ఇచ్చారు. 2012లో రూ.7,200కు పెంచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2015లో రూ.12,000 ఇచ్చింది. అదే ఏడాది పీఆర్‌సీ ప్రకారం రూ.15,600 ఇచ్చారు. అయితే పీఎఫ్, ఈఎస్ఐ కట్ అయ్యి, రూ.13,300 మాత్రమే వేతనం వస్తోంది. ఆ వేతనం పెరిగిన ధరలకు అనుగుణంగా లేదని, రూ. 22,750కు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, నైపుణ్యంతో కూడుకున్న విధులు నిర్వర్తిస్తున్నందున కేడర్ పేరును డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్‌గా మార్చాలని కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 17: మిలాద్ ఉన్ నబీ వేడుకలను జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మసీదు, మదర్సాల నుంచి శాంతి ర్యాలీలు చేట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అసర్ నమాజ్ అనంతరం సాయంత్రం ఐదు గంటలకు మిలాద్ జులూస్ మక్కా మసీదు నుంచి ర్యాలీ చేపట్టారు. క్లాక్‌టవర్ వద్ద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ స్వాగతం పలికారు. ఖౌమి ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షర్బత్‌ను ఎమ్మెల్యే యెన్నం, ఆనంద్‌గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా మహబూబ్‌నగర్ ప్రజలు కలిసి ఉంటారని అన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రవక్త చూపిన మార్గం అనుసరించాలని, ఆయన జీవితం మానవళికి ఆదర్శమని అన్నారు. ర్యాలీలకు ముందు మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. పట్టణంలో పలు చౌరస్తాలలో అన్నదానం, యువకులు రక్తదానం చేశారు. ర్యాలీ అనంతరం షాషాబ్‌గుట్ట దర్గా ఆవరణలో నిర్వహించిన ధార్మిక సభలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ధార్మిక వేత్త మౌలానా నిసార్ అహ్మద్ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్, సయ్యద్ రజాక్ షా ఖాద్రీ, అధ్యక్షుడు మజహర్‌షాహిద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు



మత పెద్దలతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



తారాకాసురుడిని వధిస్తున్న కార్తికేయుడి అలంకరణ



కోలాటం వేస్తున్న మహిళలు

ఆకట్టుకున్న అలంకరణలు

- నారాయణపేటలో అంబరాన్నంటిన గణేశ్ నిమజ్జన వేడుకలు

నారాయణపేట, సెప్టెంబరు 17: నారాయణపేట జిల్లా కేంద్రంలో వినాయక నిమజ్జన వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు అధ్యాత్మికత, సామాజిక, రాజకీయ అంశాలపై ఏర్పాటు చచేసిన అలంకరణ ఆకట్టుకున్నాయి. సోమవారం అర్ధరాత్రి ప్రారంభమైన విగ్రహాల ఊరేగింపు మగళవారం రాత్రి వరకు కొనసాగింది. గణేష్ యువజన సంఘాలు, చిన్నారులు రికార్డింగ్ డ్యాన్సులు, అడుగుల భజనలు, కోలాటం నృత్యాలు అలరించాయి. ముంబాయి, పూణే, హైదరాబాద్ వేడుకల తరహాలో నారాయణపేట నిమజ్జన అలంకరణలకు గుర్తింపును సాధించుకుంది.

ఆకట్టుకున్న అలంకరణలు

నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన పలు అలంకరణలు ఆకట్టుకున్నాయి. రామసేన భీవండి కాలనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లౌకిక భారత దేశం హలాల్ వద్దు.. జట్కా మన హక్కు అలంకరణ, చౌడేశ్వరి మందిర్ దుల్‌పేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యాచారానికి ఉరిశిక్ష విధించే అలంకరణ, మడి ఈశ్వర్ మందిర్ ఆధ్వర్యంలో సరాఫ్ బజార్ ఇరుకు రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటుండటంతో ఆ కష్టాలు తొలగించేందుకు వినాయకుడే ఎక్స్‌కవేటర్ ద్వారా రోడ్డు విస్తరణ చేపడుతున్న అలంకరణలు ఆకట్టుకున్నాయి. వాటితో పాటు సామాజిక స్పృహను కల్గింపజేసే సందేశాత్మక, ఆధ్యాత్మిక అలంకరణలు చూపరుల మెప్పును పొందాయి.



కొండారెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం చేస్తున్న విగ్రహం



అత్యాచారానికి పాల్పడిన వారికి ఉరిశిక్ష విధించాలన్న డిమాండ్‌తో సర్దార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అలంకరణ



సోమశిల ఎకో పార్కు ప్రధాన ద్వారం


సోమశిలలో వాచ్ టవర్

- అక్కడి నుంచి పర్యాటకులకు కనువిందు చేయనున్న నల్లమల అందాలు
- పది రోజుల్లో ప్రారంభం కానున్న ఎకో పార్కు

కొల్లాపూర్, సెప్టెంబరు 17: కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల వద్ద ఎత్తయిన కొండలపై నుంచి నల్లమల అందాలను, కృష్ణానదిని తిలకించేందుకు వాచ్ టవర్‌ను నిర్మించారు. కొల్లాపూర్‌కు తొమ్మిది కిలో మీటర్ల దూరంలో ఉన్న సోమశిల గ్రామానికి చేరుకోక ముందే అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎకో పార్కును ఏర్పాటు చేశారు. ఈ పార్కులో ఎత్తయిన కొండపై వాచ్ టవర్‌ను నిర్మించారు. అక్కడి నుంచి నల్లమల అడవి అందాలను, పారుతున్న కృష్ణానదిని తిలకించవచ్చు. పది రోజుల్లో ఈ పార్కును ప్రారంభించనున్నారు. ఇక్కడ సఫారీ వాహనం కూడా అందుబాటులోకి తేనున్నారు. రూ.వెయ్యి చెల్లిస్తే ఏడుగురిని సఫారీ వాహనంలో సోమశిల వద్ద గల కృష్ణానది నుంచి వాచ్ టవర్ వద్దకు తీసుకెళ్తారు.



వాచ్ టవర్



వాచ్ టవర్‌పై నుంచి కనిపిస్తున్న కృష్ణానది, నల్లమల కొండలు



మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ

పోటెత్తిన వేరుశనగ

గద్వాల, సెప్టెంబరు 17: గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు వేరుశనగ రాసులతో కళకళలాడుతోంది. వానాకాలం పంటలలో మొదట చేతికొచ్చే ఈ పంటను రైతులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. వారం నుంచి పంట వస్తుండగా, మంగళవారం దాదాపు 12,500 బస్తాలు అంటే 3,808 క్వింటాళ్ల వేరుశనగా వచ్చింది. క్వింటాలుకు గరిష్ఠంగా రూ.6,339, కనిష్ఠంగా రూ.1,700, సగటున రూ.5,499 ధర పలికింది. రైతులు ఇతర పంటలకు పెట్టుబడి కోసం వేరుశనగను తెంచిన వెంటనే మార్కెట్‌కు తెస్తున్నారని, తేమ అధికంగా ఉండటంతో ధర తక్కువగా వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు.






పులికల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

అయిజ, సెప్టెంబరు 17: మండలంలోని పులికల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డిని అధికారులు సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు జిల్లా అధికారులు ఈనెల 13న శుక్రవారం సస్పెండ్ చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించిన కాపీని ఎంపీడీఓ కార్యాలయం ద్వారా మంగళవారం కిరణ్‌కుమార్‌రెడ్డికి అందజేసినట్లు తెలిసింది.









ఆల్మట్టి నుంచి శ్రీశైలం వరకు గేట్లు బంద్

గద్వాల, సెప్టెంబరు 17 : వర్షాలు తగ్గుముఖం పట్టి కృష్ణానదికి వరద తగ్గిపోవడంతో ఆల్మట్టి నుంచి శ్రీశైలం జలాశయం వరకు ఉన్న కృష్ణా ప్రాజెక్టుల గేట్లు మూసుకున్నాయి. కేవలం విద్యుత్ ఉత్పత్తి ద్వారానే నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం ఆల్మట్టికి 16వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 15 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. నారాయణపూర్‌కు 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 4 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాలకు 34,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లు మూసివేసి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 25,980 క్యూసెక్కులు శ్రీశైలం ప్రాజెక్టుకు వదులుతున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు 11,236 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లను మూసివేయడంతో పాటు జలవిద్యుత్ ఉత్పత్తిని కూడా నిలిపివేశారు. సుంకేసులకు 11,403 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 8.950 క్యూసెక్కులు శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 40 వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పడిపోవడంతో గేట్లను మూసివేసి కేవలం విద్యుత్ ఉద్పత్తి ద్వారా 67 వేల క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 197.46 టీఎంసీల నిల్వకు చేరుకున్నది.

జగత్‌పల్లిలో గణేశ్ లడ్డూ రూ.2.70లక్షలు


లడ్డూను దక్కించుకున్న భవాని యూత్ సభ్యులు

పెద్దమందడి, సెప్టెంబరు 17: గణేశ్ ఉత్సవాలను పురస్కరించుకుని పెద్దమందడి మండలం జగత్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన వేలంపాటలో గ్రామ వినాయకుడి లడ్డూకు వనపర్తి జిల్లాలో రికార్డు ధర పలికింది. విఘ్నేశ్వర యూత్ ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూవేలంలో భవాని యూత్ సభ్యులు, గ్రామానికి చెందిన ముంత భాస్కర్ (రిపోర్టర్), విఘ్నేశ్వర యూత్ మరికొందరు సభ్యులు పోటాపోటీగా వేలంలో పాల్గొనగా, చివరగా భవాని యూత్ సభ్యులు ముంత మల్లేష్, చెవ్వ సురేష్, శశిధర్‌రెడ్డి, ప్రకాష్, శివ, రాజు, బాలరాజు రూ.2లక్షల 70వేలకు దక్కించుకున్నారు.

భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్య

రాజోలి, సెప్టెంబరు 17: భార్య కాపురానికి రావడంలేదని పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగు లాంబ గద్వాల జిల్లా బుడమర్సు గ్రామంలో చోటుచేసుకుంది. రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ కథనం ప్రకారం.. వడ్డేపల్లి మండలం బుడమర్సు గ్రామానికి చెందిన చిన్నమద్దిలేటి(40) కి 20ఏళ్లక్రితం రాజోలి మండలంలోని పెద్ద తాండ్రపాడుకు చెందిన లక్ష్మీతో వివాహమైంది. కొన్ని నెలలుగా తాగుడుకు బానిసై, ఇంట్లో కుటుంబ సభ్యులను రోజూ కొడుతుండటం తో ఈనెల 3న భార్య లక్ష్మి తన పుట్టింటికి పెద్దతాండ్రపాడు వెళ్లింది. తిరిగి భార్య కాపురానికి ఇంటికి రావడంలేదని మన స్తాపం చెందిన చిన్న మద్దిలేటి సోమవారం సాయంత్రం 7గంటల సమయంలో తన వ్యవసాయం పొలంవద్ద పురుగుల మందు తాగాడు. అటుగా వెళ్లే వారు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 11గంటల సమయంలో మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి అన్న మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.











పాఠశాల యజమానిపై కేసు నమోదు చేయాలి

విద్యార్థి సంఘాల నాయకుల ధర్నా



పాఠశాల గేటు వద్ద విద్యార్థి సంఘాల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

వనపర్తి రూరల్, సెప్టెంబరు 17: చెరువులో పడి విద్యార్థి మృతికి కారణమైన పాఠశాల యజమానిపై కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తిలోని సెయింట్ థామస్ హైస్కూల్ గేటు ముందు నిరసనతో పాటు ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే 8వ తరగతి చదువుతున్న విద్యార్థి నిశాల్ మృతి చెందాడని మండిపడ్డారు. పాఠశాల ఆవరణలో ఆడుకోవడానికి గ్రౌండ్ ఉండాలే గానీ, చెరువు ఎట్ల ఉంటుందని మండిపడ్డారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం ఒక కారణమైతే పాఠశాల యజమాని మరో కారణమన్నారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రైవేటు విద్యాసంస్థల్లో చలనం లేకుండా పోయిందన్నారు. మృతి చెందిన విద్యార్థికి న్యాయం జరగకపోతే మరింత ఆందోళనలు చేపడతామన్నారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా గేటు వద్ద పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ తదితర విద్యార్థి సంఘాల నాయకులు గణేశ్, పరశురాం, అర్జున్ పాల్గొన్నారు.

విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం

▪ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన స్కూల్ బస్సు ▪ ఊపిరిపీల్చుకున్న తల్లిదండ్రులు ▪ జోగుళాంబ గద్వాల జిల్లాలో ఘటన

గద్వాల, సెప్టెంబరు 17: ఓ ప్రయివేటు పాఠశాల బస్సు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. చెట్టును ఢీకొట్టి ఆగిపోయిన ఘటన మంగళవారం ఉదయం జోగుళాంబ గద్వాల జిల్లా పరమాల స్టేజీ సమీపంలో చోటుచేసుకున్నది. బస్సులోని విద్యార్థులు ఎలాంటిగాయాలు లేకుండా సురక్షితంగా బయటపడటంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. గద్వాలలో ప్రగతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన బస్సు ఉదయం వివిధ గ్రామాల నుంచి విద్యార్థులను ఎక్కించుకొని గద్వాలకు బయలుదేరింది. ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు డ్రైవర్ అజాగ్రత్తగా, వేగంగా వెళ్లాడు. అదే సమయంలో ఎదురుగా మరోవాహనం రావడంతో దాన్ని తప్పించేందుకు రోడ్డుదిగాడు. ఈక్రమంలోనే అదుపుతప్పి ఒరిగిపోయి రోడ్డు వెంట వేసిన చెట్లను ఢీకొని నిలిచిపోయింది. దీంతో అందులోని విద్యార్థులు భయభ్రాంతులకు గురై హాహాకారాలు చేశారు. నిలిచిపోయిన బస్సు నుంచి వెంటనే కిందికిదిగారు. ఈ విషయం తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పిల్లలు క్షేమంగా ఉండడంతో ఊపిరిపీల్చుకున్నారు. మరో బస్సులో పాఠశాలకు చేర్చారు. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న రూరల్ ఎస్సై శ్రీకాంత్ అక్కడికి చేరుకొని డ్రైవర్ పెద్ద ఆంజనేయులును అదుపులోకి తీసుకున్నారు. పలువిద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకొని విచారించగా డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేశాడని తేలడంతో అతనిపై, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని బస్సుల ఫిట్‌నెస్, బీమా, డ్రైవర్ల లైసెన్స్‌లుతనిఖీ చేయాలని ఆర్టీఓను కోరారు.



రోడ్డుకిందికి ఒరిగిపోయి చెట్టును ఢీకొట్టిన స్కూల్ బస్సు

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ఛత్రపతి (ఫైల్)

చారకొండ, సెప్టెంబరు 17: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామస్థు లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జూపల్లి గ్రా మానికి చెందిన అంకిళ్ల ఛత్ర పతి(20) గతనెల 30న జూప ల్లి నుంచి కల్వకుర్తికి బైక్‌పై వె ళ్తుండగా కల్వకుర్తి సమీపంలోని కల్వకుర్తి-దేవరకొండ జాతీ య రహదారిపై ప్రమాదవశాత్తు బైకు అదుపుతప్పి కిందప డ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికు లు వెంటనే 108కు సమాచారం అందించగా, సిబ్బంది కల్వ కుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించ డంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

మహిళ మృతిపై కేసు నమోదు

తెలకపల్లి, సెప్టెంబరు 17: బాత్రూమ్‌లో కాలు జారిపడి మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. వివాహిత జంపాల మాధవి(34) తన ఇంట్లో ఉదయం 4:30 గంటలకు బాత్రూమ్‌కు పోయి బాత్రూమ్ ముందు ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి స్పృహకోల్పోయింది. కుటుంబ సభ్యులు గమనించి 108అంబులెన్స్‌లో నాగర్‌కర్నూ ల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే చనిపోయిందని నిర్ధారించారు. మృతురాలి తల్లి జంపాల సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎస్వీఎస్‌లో ఘనంగా ఓనమ్ పండుగ



కేరళ విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) సెప్టెంబరు 17: కేరళ రాష్ట్రంలో జరుపుకొనే అతి పెద్ద ఓనమ్ పండుగను మంగళవారం ఎస్వీఎస్ నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులు ఘనంగా నిర్వహించారు. తమ సంస్కృతీ, సంప్రదాయం ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించా రు. కళాశాల ఆవరణలో పువ్వులతో ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. అనంతరం కేరళ సంస్కృతికి అద్దంపట్టే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఓనం సద్య ఫుడ్‌తో పాటు షక్కర వరటి అనే పాయసాన్ని పంచిపెట్టారు. అలాగే వాడంవళి, ఒరియోడి అని పిలువబడే ఆటలు, తిరువాతిర వలంగళి అనే నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అంద జేశారు. ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్లు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్. కె.జె రెడ్డి, డాక్టర్ వెంకటరె డ్డి, రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి విద్యార్థులకు ఓనమ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లీనా మధుర, ట్యూటర్లు ధన్య, నాగమ్మ, తార, బినిత, విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆహ్లాదకర ప్రాంతంలో గురుకుల పాఠశాల

- పెంట్లవెల్లి మండలంలో భూములు పరిశీలించిన మంత్రి జూపల్లి



జటప్రోలు వద్ద కృష్ణానది ఒడ్డున స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి, సెప్టెంబరు17: ఆహ్లాదకర వాతావరణంలో కృష్ణానది ఒడ్డున గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జటప్రోలులో కృష్ణానది ఒడ్డున 508 సర్వే నెంబర్‌లో 20 ఎకరాల భూమిని, గోప్లాపూర్ శివారులో సర్వే నెంబర్ 177, 147లో భూమిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తం 4వేల మంది విద్యార్థులు చదువుకునే విధంగా రూ.50కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఆర్డీవో నాగరాజు, గ్రామ నాయకులు గోవిందుగౌడ్, భీంరెడ్డి, మోత్కూరు నాగిరెడ్డి, సునిగిరి శ్రీనివాసులు, వెంకటేష్, తిరుపాలు, గుర్కా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి చికిత్స చేయించిన ఎమ్మెల్యే

అలంపూర్ చౌరస్తా, సెప్టెంబరు 17: ఉండవల్లి మండలంలోని ఇటిక్యాలపాడు శివారులో జాతీయ రహదారిపై కారు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు చికిత్స చేయించాడు. కర్నూలు జిల్లా గంగవరం గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి కారులో బీచుపల్లి దైవదర్శనానికి వెళ్లి, తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కారుఅదుపుతప్పి బోల్తాపడింది. అదే సమయంలో వచ్చిన ఎమ్మెల్యే గమనించి, 108సిబ్బందికి సమాచారం ఇచ్చి, క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేయించిపంపారు. రోడ్డుపై నుంచి కారును తీయించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

మహమ్మదాబాద్ సెప్టెంబరు 17: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన మహమ్మదాబాద్ బస్టాండ్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది . స్థానికుల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని దాదాపూర్ గ్రామానికి చెందిన రమేష్, రఘు పని నిమిత్తం మహబూబ్‌నగర్ వచ్చి తిరిగి వెలుతుండగా మహమ్మదాబాద్ బస్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. ఈ మేరకు రమేష్ తల్లి మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 30తులాల బంగారం, 2 కిలోల వెండి అపహరణ



ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు

పెంట్లవెల్లి, సెప్టెంబరు 17: తాళం వేసిన ఇంట్లో 30తులాల బంగారం, రెండు కిలోల వెండి చోరీచేసిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. డీఎస్పీ బుర్రి శ్రీనివాసు లు కథనం ప్రకారం.. పెంట్లవెల్లిలోని బచ్చువీధికి చెందిన ఎండీ షంషోద్దిన్ తల్లి చని పోవడంతో వారు కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రకు ఈనెల 14న వెళ్లారు. మంగ ళవారం ఉదయం ఇంటి పైభాగంలో ఉన్న కిటికీలు డోరు తెరుచుకొని కనపడటంతో ఇంటిపక్కన వారు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఇంటికి వచ్చి చూడగా చోరీ జరి నట్లు గుర్తించి ఎండీ షంషోద్దిన్ కుమారుడు కరీముల్లా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎలాంటి ఆధారాలు దొరకకుండా దొంగలు ఇంట్లో వస్తువులపై కారంపొడి చల్లారని, క్లూస్ టీం ఆధారంగా త్వరలోనే గుర్తిస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ విచారణలో సీఐ మహేశ్, కొల్లాపూర్ ఎస్ఐ రిషికేశ్ తదితరులు ఉన్నారు.

మూసాపేట సంతలో సెల్‌ఫోన్‌ల చోరీ


మూసాపేట, సెప్టెంబరు 17: మండలకేంద్రంలో మంగళవారం కూరగాయల సంతలో సెల్‌ఫోన్ల చోరీ ఘటన చోటుచేసుకోవడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని నిజాలాపూర్ గ్రామానికి చెందిన సతీష్ రూ.30వేల ఫోన్, కమ్మరి రమేశ్ రూ.20 వేల సెల్‌పోన్ సంతలో కూరగాయలు కొనుగోలు చేయడానికి రాగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అదేవిధంగా గత సోమవారం జానంపేట సంతలో కూడా రాజు అనే వ్యక్తి సెల్‌పోన్ చోరీ జరిగింది. మూసాపేట సంతలో స్థలాభావం సమస్య వలన రద్దీ సంద ట్లో సండేమియాగా కొందరు దొంగలు అదే ఆసరాగా చేసుకుని తరుచుగా సెల్‌పోన్‌లను తస్కరిస్తున్నారు. అధికారులు గట్టి నిఘాతో అట్టివారిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాపర్ వైరు చోరీలకు పాల్పడుతున్న

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- కుటుంబ సభ్యులే ముఠాగా ఏర్పడి చోరీలు
- జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు
- సునాయాసంగా డబ్బు సంపాదనకు కాపర్ వైర్ అపహరణ
- నిందితులు ఇటిక్యాల మండలం

ఆమనగల్లు, సెప్టెంబరు 17:జల్సాలకు అలవాటుపడి కుటుంబ సభ్యులతో ముఠాగా ఏర్పడి కాపర్ వైరు చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగలను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో మంగళవారం స్థానిక ఎస్ఐ బి. వెంకటేశ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టి కేసు వివరాలు సీఐ బి. ప్రమోద్ కుమార్ వెల్లడించారు. గద్వాల జిల్లా ఇటిక్యాల కు చెందిన వజ్రగిరి సత్యరాజు, వజ్రగిరి మధు లు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఒక ముఠాగా ఏర్పడి చోరీలు సాగిస్తున్నారు. సునాయాసంగా డబ్బు సంపాదనకు వ్యవసాయ బోరు మోటర్లు చోరీ చేసి అందులోని కాపర్ వైరును అమ్మి వచ్చిన డబ్బును అందరు సమానంగా పంచుకునేవారు. జల్సాలకు అలవాటు పడ్డ ముఠా సభ్యులు బోరు మోటర్ల కాపర్ వైర్ల చోరీ ద్వారా ఎక్కువ డబ్బు రావడం లేదని సోలార్ విద్యుత్ ప్లాంట్లలో కాపర్‌వైరు, సెల్ టవర్లలో బ్యాటరీల చోరీ సాగిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూలై 19న ఆమనగల్లు మండలం మేడిగడ్డ గ్రామ సమీపంలోని సోలార్ ప్లాంట్ లో రూ.10 వేల విలువ చేసే కేబుల్ వైరు చోరికి గురైంది. ఈ మేరకు ప్లాంట్ నిర్వాహకుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆమనగల్లు పట్టణ సమీపంలోని సేవాలాల్ గుట్ట వద్ద అను మానాస్పదంగా తిరుగుతున్న వజ్రగిరి సత్యరాజు, వజ్రగిరి మధులను పోలీసులు అదుపులోకి తీసుకో ని విచారించారు. మేడిగడ్డ గేటు వద్ద సోలార్ ప్లాంట్‌లో జరిగిన కాఫర్ వైర్ చోరితో పాటు నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి, మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్, నారాయణపేట జిల్లా అడ్డాకుల, చిన్నచింతకుంట, మక్తల్‌లో 9 చోరీలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు సీఐ ప్రమోద్ కుమార్ వెల్లడించారు. మంగళవారం నిందితులు సత్యరాజు, మధు లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దొంగతనం కేసును సమయస్ఫూర్తితో చేదించి నిందితులను అరెస్ట్ చేసిన ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, సిబ్బంది శివకుమార్, రఘు,జామవా లను సీఐ ప్రమోద్ కుమార్ అభినందించారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్ కుమార్

బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఇద్దరి రైతుల మృతి

- వేగంగా ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు
- ఇంటి నుంచి పొలానికి వెళ్తుండగా ప్రమాదం
- మృతులు రంగాపురం వాసులు



హరిజన్ రాముడు (ఫైల్)



మసీదు శేఖర్ (ఫైల్)

పెబ్బేరు రూరల్, సెప్టెంబరు 17 : మోటార్ సైకిల్‌పై రోడ్డు దాటుతున్న ఇద్దరు రైతులను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన మంగళవారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగాపురం గ్రామానికి చెందిన హరిజన్ రాముడు(60), మసీద్ శేఖర్ (58) ఇద్దరూ కలిసి వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా రోడ్డును దాటేక్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. దీంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందారు.

ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతోనే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపించారు. ఒకే రోజు ఇద్దరు రైతులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయ లు అలుముకున్నాయి. ఈ సంఘటనపై వివరాలను సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

దొంగకు జైలుశిక్ష, జరిమానా

జడ్చర్ల, సెప్టెంబరు 17: వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును మాయమాటలు చెప్పి అపహరించిన నిందితుడికి 17 నెలలు జైలు శిక్ష, రూ.1వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జడ్చర్ల అదనపు కోర్టు న్యాయమూర్తి మహ్మద్‌ముద్దసిర్ మంగళవారం తీర్పు చెప్పారు. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి గ్రామానికి చెందిన చీకూరి చుక్కమ్మ అనే మహిళ 2022 ఫిబ్రవరి 10న జడ్చర్ల పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో పనిపై వచ్చింది. నిందితుడు మిడ్జిల్ మండలం వెల్గోములకు చెందిన కావలిలక్ష్మయ్య అదే సమయంలో చౌరస్తాలో ఉన్నాడు. వృద్ధురాలు మెడలో అరతులం బంగారు గొలుసు ఉన్నట్లు గుర్తించి, అపహరించేందుకు ప్రణాళిక వేసాడు. వృద్ధురాలుతో పరిచయం చేసుకుని, మెడలో ఉన్న గొలుసు ఇస్తే, ఫోటో స్టూడియోలో ఫోటో దిగి ఇస్తా అంటూ మభ్యపెట్టి, గొలుసును తీసుకెళ్లాడు. తిరిగి ఎంతకూ తిరిగిరాకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి, ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు జరిగిన విషయం చెప్పింది. అనంతరం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ రమేశ్‌బాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహబూబ్‌నగర్ టౌన్‌లో ఓ కేసులో పట్టుబడిన కావలిలక్ష్మయ్యను అనుమతులు తీసుకుని జైలులో వృద్ధురాలు చీకూరి చుక్కమ్మకు చూపించారు. తన వద్ద గొలుసును అపహరించిన వ్యక్తి కావలిలక్ష్మయ్యనే అని గుర్తించింది. ఈ కేసుకు సంబంధించి తాజాగా సాక్ష్యులను ప్రవేశపెట్టిన పబ్లిక్‌ప్రాసిక్యూటర్ దీపిక వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి నిందితుడు కావలిలక్ష్మయ్యకు 17నెలల జైలుశిక్ష, రూ.1వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని సీఐ ఆదిరెడ్డి వివరించారు.

అమ్మమ్మ మృతితో అనాథలైన చిన్నారులు

వడ్డేపల్లి, సెప్టెంబరు 17: తండ్రి వదిలేసి వెళ్లిపోగా, తల్లి ఇటీవలే చనిపోవడంతో ఆ చిన్నారులకు అమ్మమ్మే అన్నీతానైంది. మంగళవారం ఆమె కూడా మృతి చెందడంతో ఆ పసివాళ్లు దిక్కూమొక్కు లేని అనాథలుగా మిగిలారు. శాంతినగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. వడ్డేపల్లి మునిసి పాలిటీ శాంతినగర్‌లో గత కొంతకాలంగా కృష్ణవేణి దంపతులు నివాసముంటున్నారు. వారికి ఇద్దరు సంతానం. షాపు షెటర్లు నిర్మాణం కోసం తీసుకున్న అప్పుల కారణంగా వడ్డీలు భారంగా మారడంతో తల్లి కృష్ణవేణి మానసికంగా కుంగిపోయి ఏడు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. గత పదేళ్లుగా తండ్రిఆచూకీ లేకపోడవం, తల్లి మరణంతో పిల్లలు భాను ప్రకాష్, ఉదయ్ కౌశిక్ కొంతకాలంగా అమ్మమ్మ సం రక్షణలో చదువుకుంటున్నారు. కాగా, తీవ్ర అనారోగ్యంతో మంగళవారం అమమ్మ జయమ్మ కూడా మృతి చెంద డంతో కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. వృద్ధురాలి కర్మకాండలను కూడా గ్రామ పెద్దలు కలిసి నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం స్పందించి చిన్నారుల చదువుతో పాటు వారి సంరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అమమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న చిన్నారులు

తమ్ముడి భూమిని కొడుకుకు పట్టా చేసిన అన్న

- నిలదీసిన గ్రామస్థులు.. అధికారులకు ఫిర్యాదు

నవాబ్‌పేట, సెప్టెంబరు 17: సొంత తమ్ముడే అయినా అతని భూమిని తనకొడుకు పేరు న పట్టా చేసుకున్నాడు అన్న. ఈవిషయం తెలియడంతో తట్టుకోలేని గ్రామస్థులు నిలదీసి, అధికారులకు పిర్యాదు చేసిన ఘటన మహ బూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కిషన్‌గూడలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని లింగంపల్లి రెవెన్యు శివారులోని కిషన్‌గూడకు చెందిన అంజయ్య గతనెలలో తన తమ్ముడు కేశవులుతో మాట్లాడి అతని భూమిని కొంత తన కుమారుడైన రాములుకు పట్టా (రిజిస్ట్రేషన్) చేస్తున్నానని నీవు సాక్ష్యం ఉండాలని చెప్పి తహసీల్దార్ కార్యాలయంలో కేశవులుకు చెందిన సర్వేనెంబర్ 71, 72లోంచి ఎకరం పొలం పట్టా చేయించాడు. ఈ విషయం తెలుసుకున్న కేశవులు అన్నను నిలదీయడంతో నోరు మెదపలేదు. దీంతో గ్రామస్థులు జోక్యం చేసుకుని పంచాయితీ పెట్టగా తన తమ్ముడు కేశవులు తనకు బాకీ ఉన్నాడని చెప్పడంతో, గ్రామస్థు లంతా ఏకమై తహసీల్దార్ కార్యాలయంలో ఉపతహసీల్దార్ గాయత్రికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాదికారుల ఆదేశానుసారం తదుపతరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరికి అండగా ఉంటాం

» ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



పాలెం బాలాజీ గార్డెన్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి, సెప్టెంబరు 17 : ప్రజాపాలనలో పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించి అండగా ఉంటామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బిజినేపల్లి మండలం పాలెంలోని బాలాజీ గార్డెన్‌లో మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, ఐదుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేసి, మాట్లాడారు. ప్రజల వద్దకే పాలన దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన సాగిస్తున్నారని అందుకు అనుగుణంగా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటస్వామి, మాజీ సర్పంచ్‌లు అవంతి శంకర్, అమృత్‌రెడ్డి, తిరుపతయ్య, రాంచందర్, వంగ సుదర్శన్, శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ బాలపీరు, డీసీసీ ఉపాధ్యక్షులు పర్వతాలు, ముక్తార్, ఎంపీటీసీ మాజీ సభ్యులు, మండల నాయకులు, తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో కతలప్ప, ఏవో నీతి తదితరులున్నారు.

పాలెంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.20 కోట్లు

పాలెంలో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి తెలిపారు. పాలెంలోని ఇండస్ట్రీయల్ ఏరియాలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ పూర్తయిందని, నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి ఖానాపూర్, గుడ్లనర్వ, కారుకొండ, వసంతాపూర్, లింగసానిపల్లి, పాలెం గ్రామ ప్రజలకు విద్యుత్ ఇక్కట్లు లేకుండా చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేను పాలెం గ్రామస్థులు వెంకట్‌రెడ్డి, నరసింహారెడ్డి, గోవిందు రామకృష్ణలు ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళి

బిజినేపల్లి, సెప్టెంబరు 17 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో హైదరాబాద్ సంస్థానం భారత ప్రభుత్వంలో విలీనం కోసం, దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన సమరయోధులు ఏ.సుదర్శన్, ఏ.రాములు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన స్థూపం వద్ద వారి కుటుంబ సభ్యులు తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో కతలప్పలతో కలిసి మంగళవారం జాతీయ జెండాను ఎగరేసి, నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మధుసూదన్, విజయ్‌కుమార్, శశికళ, హరిక, డీటీ రవికుమార్‌నాయక్, ఎంపీవో నరసింహులు, మాజీ సర్పంచ్ రాజేందర్‌గౌడ్, సురేష్, చంద్రశేఖర్, గణేష్‌గౌడ్, ఈశ్వర్, రమేష్‌గౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అంజనేయ విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న గిరిజనులు


బిజినేపల్లి, సెప్టెంబరు 17 : పునరావాస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ నిర్వాసిత గిరిజనులు మంగళవారం ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ప్రత్యేక పూజలు ఘనంగా చేశారు. వేద పండితులు ఆంజనేయస్వామి విగ్రహానికి పంచామృతం, గంధం, గంగాజలంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అంజనీపుత్రుడిని అలంకరించి గిరిజనులతో పూజ క్రతువులను నిర్వహించారు. ప్రతిష్ఠ పూజలను అర్చకబృందం మధు, నరసింహయ్య, మునీంద్రలు ముగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముడావత్ రామునాయక్, పాండునాయక్, తిరుపతినాయక్, చంద్యానాయక్, గోపాల్‌నాయక్, హనుమంత్‌నాయక్, దేవ్యానాయక్, మశన్న, సుభాష్, బాబునాయక్ తదితరులున్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» షీటీమ్ జిల్లా ఇన్‌చార్జి విజయలక్ష్మీ

తాడూరు, సెప్టెంబరు 17 : మహిళలు, విద్యార్థినులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి బెదిరింపులకు భయపడొద్దని షీటీమ్ జిల్లా ఇన్‌చార్జి విజయలక్ష్మీ అన్నారు. మంగళవారం మండలంలోని కస్తూర్బాగాంధీ ఆవరణలో ఏర్పాటుచేసిన షీటీమ్ అవగాహన సదస్సులో విజయలక్ష్మీ టీసేఫ్ యాప్ గురించి అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు, బాలికలు తెలిసిన వారితోనే ఎక్కువగా వేధింపులకు గురవుతున్నారని జాగ్రత్తగా ఉండాలే తప్ప అధైర్యపడొద్దని, వేధింపులకు పాల్పడిన వారి వివరాలను షీటీమ్‌ను సంప్రదించి ఫిర్యాదు చేస్తే ఆకతాయిల ఆట కట్టి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో షీటీమ్ బృందం వెంకటయ్య, వెంకటనాయక్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ విజయ, భరోసా కోఆర్డినేటర్ శ్రీలత తదితరులున్నారు.

చెంచుపెంటలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



చెంచులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మన్ననూర్, సెప్టెంబరు 17 : అమ్రాబాద్ మండల పరిధిలోని కొమ్మనపెంటలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్మ్మ ఒక ఆదివాసీ మహిళనే అని, ఆమెకు భారత ప్రథమ మహిళ అవకాశం కల్పించింది మోదీ ప్రభుత్వమేనని చెంచులకు అవగాహన కల్పించారు. చెంచుల నడుమనే పెంటలో మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చెంచులకు దుస్తులు, నిత్యావసర సరకులు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల అధ్యక్షుడు గోలి రాజు, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలి



మునిసిపల్ కార్యాలయం వద్ద స్వచ్ఛతపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ ఎడ్మసత్యం, కమిషనర్ మహబుబ్‌షైక్

కల్వకుర్తిటౌన్, సెప్టెంబరు 17 : స్వచ్ఛతపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని మునిసిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, కమిషనర్ మహబుబ్‌షైక్ అన్నారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో, పట్టణంలోని బీసీ గురుకుల పాఠశాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీ వరకు అన్ని పాఠశాలలు, వార్డుల్లో కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతీ ఒక్కరి చేత ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షాహేద్, వార్డు కౌన్సిలర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి, సంరక్షించుకోవాలి

ఉప్పునుంతల/ఊర్కొండ, సెప్టెంబరు 17 : స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉప్పునుంతల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో మోహన్‌లాల్‌తో కలిసి జడ్పీటీసీ మాజీ సభ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి తదితరులు మొక్కను నాటి, వాటికి నీళ్లు పట్టారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి బిక్కునాయక్, ఏవో రమేష్ తదితరులున్నారు. అదేవిధంగా, ఊర్కొండతో పాటు నర్సంపల్లి, గుండ్లగుంటపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంపీడీవో కృష్ణయ్య స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణం, పిచ్చిమొక్కల తొలగింపు, మొక్కలు నాటడం కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఎంపీవో లక్ష్మణ్‌నాయక్, ఏపీవో నర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తితోనే ప్రజాపాలన

» అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



అచ్చంపేటలో జెండావిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వంశీకృష్ణ



కల్వకుర్తిలో జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

అచ్చంపేటటౌన్/మన్ననూర్, సెప్టెంబరు 17 : తెలంగాణ సాయుధ రహిత పోరాట స్ఫూర్తియే ప్రజాపాలన దినోత్సవమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ప్రజాపాలన దినోత్సవంగా మంగళవారం అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన జెండావిష్కరణ చేశారు. అదేవిధంగా, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల వద్ద అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా సెప్టెంబరు 17వ తేదీని తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి చిత్రపటాలను అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పంపిణీ చేశారు.

అన్నివర్గాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి : తెలంగాణ రాష్ట్రంలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన కొనసాగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ప్రజలందరికీ రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడి భారత ప్రభుత్వంలో విలీనమయ్యేలా కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ టీఎన్‌జీవో కార్యాలయం ఎదుట జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న టీఎన్‌జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

కలెక్టరేట్‌లో...

నాగర్‌కర్నూల్ (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన దినోత్సవం మంగళవారం జిల్లాలో ఘనంగా జరిగింది. కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ కార్యాలయంలో గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు జాతీయ పతాకావిష్కరణ చేశారు. టీఎన్‌జీవో కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రసంగించారు. ఆయాచోట్ల జరిగిన కార్యక్రమాల్లో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సోమిశెట్టి శ్రీధర్, యుగంధర్‌రెడ్డి, వెంకటేశశెట్టి, వెంకట్‌రెడ్డి, వార్డెన్ చెన్నయ్య, బాలస్వామి, వేణుగోపాల్, పాపిరెడ్డి, పాండురంగయ్య, వీరేశలింగం తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాల యాల వద్ద అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

» నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

» ఘనంగా విశ్వకర్మ జయంతి



పెంట్లవెల్లిలో విశ్వకర్మ జయంతి సందర్భంగా పూజ చేస్తున్న భక్తులు

కందనూలు/కల్వకుర్తి/పెంట్లవెల్లి/మన్ననూర్/చారకొండ/పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 17 : విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతిపాదనల ద్వారా తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా నాగర్‌కర్నూల్ పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొండూరు లలిత, విజయ భాస్కర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాండుచారి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అదేవిధంగా కల్వకుర్తి పట్టణంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా నిర్వహించిన యజ్ఞ కార్యక్రమానికి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. విశ్వకర్మల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందామంబకు విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ప్రత్యేక పూజలతో పాటు, మహాయజ్ఞం నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుదర్శన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శేషు, సుమలత, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. మన్ననూరు గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో విశ్వకర్మ చిత్రపటానికి అభిషేకాలు, హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వకర్మ యోజన నాయకులు పాల్గొన్నారు. చారకొండలో విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత విశ్వకర్మ మండల అధ్యక్షుడు నారోజు నర్సింహచారి విశ్వకర్మ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు. పెద్దకొత్తపల్లిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి.సత్యం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దండు నరసింహ, నాయకులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే



బిజినేపల్లి అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి కృష్ణాజీ



కొల్లాపూర్‌లో జెండా ఊపి మోటార్‌సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ

బిజినేపల్లి, సెప్టెంబరు 17 : సాయుధ పోరాటం వల్లే తెలంగాణ భారత దేశంలో విలీనమైందని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణాజీ, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈర్ల చంద్రమౌళి అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు ఘనంగా నివాళ్లు అర్పించి, మాట్లాడారు. పోరాటం ద్వారా మూడు వేల గ్రామాల్లోని పేదలకు పది లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టులే పంచిదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, నారాయణ, కరుణాకర్, కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కరుణాకర్, మధు, ఆంజనేయులు, యాదయ్య తదితరులున్నారు.

సీపీఐ ఘన నివాళి

పెద్దకొత్తపల్లి : మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరుల చిత్రపటాలను ఏర్పాటుచేసి సీపీఐ ఆధ్వర్యంలో పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం సీపీఐ సీనియర్ నాయకుడు జి.హుసేనయ్యను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలనరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు పెబ్బేటి విజేయుడు, కే.ఏసయ్య, కే.నరసింహ, సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద వక్రీకరణను ఎండగడదాం

కొల్లాపూర్ : సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ హిందూ, ముస్లిం కొట్లాటలుగా వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నదని ఆ ప్రయత్నాలను ఎండగడతామని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ అన్నారు. మంగళవారం కొల్లాపూర్‌లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా జెండా ఊపి, బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం శివవర్మ మాట్లాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ఎండగడుతూనే సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్ విగ్రహం ఏర్పాటుపై నిరసన

అచ్చంపేట టౌన్/కల్వకుర్తి, సెప్టెంబరు 17 : సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం అచ్చంపేట పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ రాజిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్‌తో పాటు తెలంగాణవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. కల్వకుర్తిలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆరోపించారు. అనంతరం స్థానిక వైఆర్ఆర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, కాటన్‌మిల్ అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మధు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగయ్య, మనోహర్‌రెడ్డి, తిరుపతియాదవ్, రామునాయక్, రైతు సమన్వయ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి డొక్క లింగం, యువత అధ్యక్షుడు కిశోర్, విద్యార్థి అధ్యక్షుడు దారమోని గణేష్, నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారి

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 17 : రైతులు సకాలంలో చీడపురుగులను గుర్తించి మందును పిచికారి చేయాలని భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ప్రముఖ శాస్త్రవేత్త గంగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బుడ్డతండా గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో అగ్రిడ్రోన్ ప్రాజెక్టు కింద మూడెకరాలు కలిగిన సన్నకారు రైతులకు పంటలో పురుగుల మందును ఉచితంగా పిచికారి చేసి, అవగాహన కల్పించారు. మండలంలోని చందాపూర్, హాజీపూర్ గ్రామ శివారు ప్రాంతాల్లో 150 ఎకరాలకు డ్రోన్ ద్వారా ఉచితంగా పురుగుల మందును పిచికారి చేశామన్నారు. పంట చేనులో డ్రోన్ వినియోగం భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలను పెంచుతుందన్నారు. కూలీల కొరతతో పాటు, పురుగుల మందును ఆదా చేయొచ్చన్నారు. కార్యక్రమంలో హాజీపూర్, చందాపూర్ ఏఈవోలు పరమేష్, వినోద్‌కుమార్, నాయకులు శ్రీనివాసులు, గోపాల్ తదితరులున్నారు.

లక్ష్మారెడ్డిని పరామర్శించిన మల్లురవి



డాక్టర్ లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న డాక్టర్ మల్లురవి

తిమ్మాజిపేట, సెప్టెంబరు 17 : జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డిని మంగళవారం రాత్రి నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి పరామర్శించారు. మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో డాక్టర్ లక్ష్మారెడ్డి ఇంటికెళ్లి శ్వేతారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈనెల 19న జరిగే పది రోజుల కార్యక్రమానికి రావాలని లక్ష్మారెడ్డి డాక్టర్ మల్లురవిని కోరారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్త వెంకట్రాములు ఇంటికి వెళ్లారు. మల్లురవి వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు ఎక్సైజ్ వాహనాల వేలం

కొల్లాపూర్, సెప్టెంబరు 17 : వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను బుధవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నామని ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఉదయం 10 గంటలకు కొల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌లో రూ.ఐదు వేలు డిపాజిట్ చేయాలని సీఐ పేర్కొన్నారు.

కేఎల్ఐ ద్వారా ఎనిమిది వేల ఎకరాలకు సాగునీరు

వంగూరు, సెప్టెంబరు 17 : వంగూరు మండలంలో సాగునీరు అందని గ్రామాలకు మరికొద్దిరోజుల్లోనే కేఎల్ఐ ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని కోనేటిపురం గ్రామానికి చెందిన పది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామాల్లో 8,3,61 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ అధికారులతో చర్చించామన్నారు. అదేవిధంగా మండలంలోని ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు అల్వాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు వెంకటయ్యయాదవ్, రంగారావు తదితరులున్నారు.

ఘనంగా పెరియార్ రామస్వామి జయంతి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 17 : సమాజంలో మూఢనమ్మకాలు, అంధవిశ్వాలపై ఉద్యమాలను చేపట్టి ద్రావిడ భారతాన్ని సాధించేందుకు కృషి చేసి సాంఘీక విప్లవ ఉద్యమ పితామహుడు పెరియార్ రామస్వామినాయకర్ అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పెరియార్ రామస్వామి 145వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బస్టాండు కూడలిలో ఏర్పాటు చేసిన పెరియార్ రామస్వామి చిత్రపటానికి బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ పూలమాల వేసి నివాళులు అర్పించి, మాట్లాడారు. కార్యక్రమంలో బహుజన మేధావులు గుడిపల్లి రవి, సుబ్బయ్య, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడిగా ఉస్సేన్

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 17 : మాలమహానాడు పీవీరావు ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా పాశం ఉస్సేన్ నియామకమయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు రాంచందర్ చేతుల మీదుగా పాశం ఉస్సేన్ నియామక పత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా చెరుకు రాంచందర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, దళిత వర్గాల్లో చిచ్చు పెట్టాలనే అగ్రవర్ణ పార్టీల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా రాజేందర్‌రెడ్డి

వెల్దండ, సెప్టెంబరు 17 : పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ మండల సర్వసభ్య సమావేశంలో ఏమిరెడ్డి రాజేందర్‌రెడ్డిని మండల అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గోరటిస్వామి, అసోసియేట్ అధ్యక్షునిగా జ్ఞానేశ్వర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఏమిరెడ్డి పావని, కార్యదర్శిగా శ్రీనాథ్, మహిళా కార్యదర్శిగా సమతను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన కమిటీ సభ్యులను ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల సురేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు టీ.వెంకట్‌రెడ్డి, రవీందర్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో పద్మనాభస్వామి నోములు

తాడూరు, సెప్టెంబరు 17 : మండలంలోని సిర్సవాడ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో మంగళవారం పద్మనాభ స్వామి నోములను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మంటపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హాజరైన భక్తులకు గ్రామానికి చెందిన బీసం మహేశ్వరంగౌడ్ అన్నదానాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు జగదీశ్వర్, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం

ఉప్పునుంతల/వెల్దండ/పెంట్లవెల్లి, సెప్టెంబరు 17 : ఉప్పునుంతల మండలం కొరటికల్ గ్రామంలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు మంగళవారం నిమజ్జనానికి తరలివెళ్లాడు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో విగ్రహాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించి, సమీపంలోని డిండి ప్రాజెక్టుకు తరలించారు. అదేవిధంగా, వెల్దండలోని శ్రీసాయినగర్‌లో ఏర్పాటుచేసిన మట్టి వినాయకునికి సోమవారం రాత్రి నిమజ్జనోత్సవం చేశారు. అంతకుముందు నిర్వహించిన లడ్డూ వేలం పాటలో యెన్నం అరవింద్‌రెడ్డి(చిన్ను) రూ.76,116కు పెద్దలడ్డు, రూ.31,116కు చిన్నలడ్డును గోపిరెడ్డి వెంకట్‌రెడ్డిలు కైవసం చేసుకున్నారు. పెంట్లవెల్లి మండలం జాలుబావితండాలో సోమవారం రాత్రి నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పెద్ద లడ్డును అదే గ్రామానికి చెందిన సత్యనారాయణ రూ.65 వేలకు దక్కించుకున్నారు. చిన్న లడ్డు పబ్బాల పరుశరాముడు రూ.25,800లకు దక్కించుకున్నారు. అనంతరం గణనాథున్ని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 17 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలోని దావూద్‌ఖాన్ వీధి రాంనగర్‌కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన మహమ్మద్ ఖాజా(30) వృత్తిరీత్యా పెయింటర్. కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని కృష్ణయ్య అనే వ్యక్తి ఇంటి వద్ద పెయింటింగ్ పనులు చేస్తుండగా ఇంటికి ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.